క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

తరిగొప్పుల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి అన్నారు. జీవనజ్యోతి మండల సమాఖ్య అధ్వర్యంలో బుధవారం సెర్ప్ కార్యాలయంలో ఆహారం, పౌష్టికాహారం, ఆరోగ్యం, వాష్ వంటిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పాల్గొని వీఓఏ, వీఓటీబీ, హెల్త్‌సబ్ కమిటీలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం వసంతరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

పాలకుర్తి టౌన్: కల్తీలేని ఆహారంతో కేన్సర్ రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో సీసీ, ఎంఎస్ ఆధ్వర్యంలో వీఓఏలకు ఆరోగ్యంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రతి మంగళవారం మహిళల కోసం వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాత శిశు సమంక్షేమాధికారి సత్యవతి, ఎంపీడీఓ రాములు, ఏపీఎం నరేందర్, వీఓలు, పాల్గొన్నారు.

నియామకం

కొడకండ్ల: మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా మండలకేంద్రానికి చెందిన అందె శ్రీవర్ధ నియామకమైంది. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆమెకు నియామక పత్రాన్ని అందించారు. తనపై నమ్మకంతో రెండోసారి అధ్యక్షురాలిగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందని పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానని శ్రీవర్ధ తెలిపింది. తన నియామకం కోసం సహకరించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డితో పాటు బ్లాక్, మండల నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తార

దేవరుప్పుల: మహిళా కాంగ్రెస్ పాలకుర్తి బ్లాక్ అధ్యక్షురాలిగా రెండోసారి మండలంలోని నీర్మాల గ్రామానికి చెందిన వడ్లకొండ తారను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో తన సేవలను గుర్తించి రెండోసారి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల ఉపాధ్యక్షుడిగా బాల్‌రాజు



బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా తమ్మడపల్లి గ్రామానికి చెందిన మట్టి బాల్‌రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట



స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల జనగామలో జరిగిన లయన్స్ క్లబ్ రీజియన్‌మీట్‌లో జిల్లాలోని మొత్తం 12 క్లబ్‌ల్లో స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్‌కు ఫస్ట్ బెస్ట్ క్లబ్‌తో పాటు పలు అవార్డులు వచ్చాయని క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్ తెలిపారు. ఘన్‌పూర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ క్లబ్‌కు బెస్ట్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రటరీ, బెస్ట్ స్వాప్, బెస్ట్ హంగర్ రిలీఫ్, బెస్ట్ ఎన్విరాన్మెంట్, బెస్ట్ ట్రెజరర్, బెస్ట్ బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లు తదితర మొత్తం 11 అవార్డులు లభించినట్లు తెలిపారు. రీజియన్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ క్లబ్‌కు అవార్డులు అధికంగా రావడం సంతోషంగా ఉందని, సహకరించిన క్లబ్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం

దేవరుప్పుల: మండలంలోని సీతారాంపురం ప్రేమసదన్ ఆశ్రమంలో బుధవారం గ్రామ వీఆర్‌ఏ ఖాజాబీ జ్ఞాపకార్థం ప్రథమ వర్ధంతి సందర్భంగా కుమారులు యాకుబ్‌పాషా, నజీర్‌మియా, కూతురు హసీనా, కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదానంతో పాటు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. యాకుబీబోటు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్: ప్రజలకు ఇబ్బంది లేకుండా పట్టణంలోని హైదరాబాద్ బైపాస్ రోడ్డులో అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని మహిళా సంఘం నాయకురాలు కుంటి అన్నపూర్ణ అన్నారు. పట్టణంలో అండర్‌పాస్ నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం 20వ రోజుకు చేరింది. బూడిది అంజమ్మ, సోమేశ్, శివ, చరణ్, కొత్తపల్లి యాకలక్ష్మి పాల్గొన్నారు.

జీపీలకు నిధుల కొరత

- పాలనకు అంతరాయం
- ఇబ్బందుల్లో కార్యదర్శులు

చిల్పూరు: కొత్త గ్రామ పంచాయతీలను నిధుల కొరత వెంటాడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీపీలకు విడుదల చేసే నిధులు సకాలంలో అందకపోవడంతో పాలనకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఏ పనులు చేయలేకపోతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే ప్రత్యేకాధికారులు పాలన చేపట్టిన నిధులు లేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో మూడు నెలలకోసారి స్టేట్ ఫైనాన్స్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించేది. 15వ ఫైనాన్స్ నుంచి కేంద్ర నిధులు వచ్చేవి. ఏడాది నుంచి పాలకవర్గం లేక నిధులు విడుదల కావడం లేదు. దీంతో గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.



నష్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్రభుత్వం త్వరగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించి పాలక వర్గాన్ని ఏర్పాటు చేయించి నిధులు కేటాయిస్తే పంచాయతీలు అభివృద్ధి పథంలో ముందుకు పోనున్నాయి.

ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నాం



పాలకవర్గం ఉన్న సమయంలో ఇబ్బంది ఉండేది కాదు. ఆ తర్వాత నిధుల లేమితో ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నాం. రోజూ ట్రాక్టర్ నడిపించేందుకు డీజిల్ కోసం డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– రంగారెడ్డి, కార్యదర్శి, గార్లగడ్డతండా

నిధులు కేటాయించాలి



మాది నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీ. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి అయినప్పటి నుంచి ప్రతీదానికి ఇబ్బంది పడుతున్నాం. ముఖ్యంగా ట్రాక్టర్ మరమ్మతు, డీజిల్ కోసం ప్రజల వద్దనే అప్పు చేయాల్సి వస్తోంది. పాలకవర్గం ఏర్పడే వరకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

– బానోత్ విమల, కార్యదర్శి, తీగలతండా

బిల్లుల చెల్లింపుపై సమగ్ర విచారణ చేపట్టాలి

- పురపాలికలో నాసిరకం పనులు
- కలెక్టర్‌తో పాటు సీడీఎంఏ, విజిలెన్స్‌కు ఫిర్యాదు

జనగామ: జనగామ మునిసిపల్‌లో చేపట్టిన నాసిరకం పనులకు అడ్డగోలు బిల్లుల చెల్లింపుపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ మారబోయిన పాండు బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాతో సీడీఎంఏ, ఇంజనీరింగ్ చీఫ్, స్టేట్ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా డివైడర్, 2వ వార్డులో వైకుంఠ ధామం, తదితర పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ రిపోర్టు రాక ముందే బిల్లులు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. 2వ వార్డులో శ్మశాన వాటిక నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరు కాగా, ఇందులో అదనంగా రూ.20లక్షల పనులు జరిగినట్టు బిల్లులు చేయించుకుంటున్నారనే సమాచారం మేరకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. శ్మశాన వాటికలో మొరం, సీసీ పనులు జరిగాయని రూ.30లక్షల వరకు అదనంగా తీసుకున్నట్టు వస్తున్న ఆరోపణలపై నిజాలు బయటపెట్టాలన్నారు. డివైడర్ ఓ వైపు కూలిపోతుంటే, అధికారులు బిల్లుల చెల్లింపులు చేస్తున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు స్పష్టం చేశారు. వీటిపై సమగ్ర విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు బయటకు వస్తాయని చెప్పారు.



కూలుతున్న డివైడర్

'శ్రీహరిని విమర్శించే స్థాయి రాజయ్యకు లేదు'



మాట్లాడుతున్న రాంబాబు

రఘునాథపల్లి: అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు లేదని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అవినీతి, అక్రమాలతో నియోజకవర్గం అన్ని విధాల వెనుకబడి పోయిందన్నారు. అభివృద్ధి పనుల కోసం రూ. కోట్ల నిధులు ఎమ్మెల్యే శ్రీహరి తీసుకొచ్చారన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి గ్రామాల్లో యూత్ అధ్యక్షుల ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. లింగాజీ, క్రాంతికుమార్, భాస్కర్, రమేష్, బాష్మియా, కుమార్, నరేందర్, రమేష్, వెంకటేష్, సోమనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

జనగామ రూరల్: మండలంలోని పసరమడ్ల గ్రామ పరిధిలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం లచ్చిరాం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అన్నారు. బి.వాసు, రతన్‌సింగ్, సరోజన, జయరాం, రాములు, రాజయ్య, స్వరూప, సారయ్య, వీరన్న, శత్రు, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

రైతులకు సాగు నీరు అందేలా కృషి



కాల్వను పరిశీలిస్తున్న నాయకులు

- మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శివరాజ్

జనగామ రూరల్: రైతులకు సాగునీరు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని జనగామ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బనుక శివరాజ్ అన్నారు. మండలంలోని అడివికేశ్వాపూర్, వెంకిర్యాల గ్రామాల్లోని కెనాల్ కాల్వను బుధవారం ఆయన శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందేవిధంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, సుంకరి శ్రీనివాస్ రెడ్డి, శివరాత్రి కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు బానోత్ బన్సీ నాయక్, నామాల శ్రీనివాస్, నర్సింగరావు, శీలం కొండల్ రెడ్డి, మధు, నిఖిల్, బియా బిరయ్య, తులసిరామ్, రాజు, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



లింగాలఘణపురం: మండల కేంద్రంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పార్టీ మండల అధ్యక్షుడు బస్వసాని శ్రీనివాసు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. క్యాలెండర్‌తో పాటు డైరీని కూడా పలువురికి అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు శేఖర్, వీరయ్య, సోమిరెడ్డి, విష్ణు, శ్రీహరి, గ్రామశాఖ అధ్యక్షుడు యాదగిరి, రవి, చంద్రయ్య, వెంకట్‌రెడ్డి, అనిల్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

- ఎంఈఓ రఘునందన్‌రెడ్డి

రఘునాథపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రఘునందన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండల స్థాయి వజ్రోత్సవ పోటీలను కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఉపేంద్ర, రవీందర్, ఆనంద్‌కుమార్, నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రఘునందన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. డీఆర్‌పీలు సురేష్, వెంకటేశ్వరరావు, రాజు, జయపాల్‌రెడ్డి, సమ్మయ్య, రమాదేవి, మల్లికార్జున్, కనుకయ్య, రమేష్, జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో టీచర్లు

రుణం చెల్లించాలని బ్యాంకు అధికారుల ఒత్తిడి

- ఇంటి గేటు తీసుకెళ్లమని అందించిన బాధిత కుటుంబం

కొడకండ్ల: తీసుకున్న రుణం చెల్లించాలని బ్యాంక్ అధికారులు ఓ కుటుంబాన్ని నిలదీసిన ఘటన బుధవారం ఏడునూతన గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఐదుగురు మహిళల చొప్పున మూడు గ్రూపులకు 2021సంవత్సరంలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో డీసీసీబీ స్టేషన్‌ఘన్‌పూర్ బ్రాంచ్ ద్వారా గేదెల కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.87వేల చొప్పున రుణం అందించారు. ఈఎంఐ రూ.4వేల చొప్పున కొన్ని నెలల పాటు మహిళలు చెల్లించారు. అనంతరం గేదెలు పాలు ఇవ్వకపోవడంతో మహిళలకు ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐలు చెల్లించలేదు. దీంతో బ్యాంక్ అధికారులు డిఫాల్టర్‌లకు నోటీసు ఇచ్చి రికవరీ ప్రయత్నాలు చేయగా కొందరు రుణం చెల్లించారు. తాజాగా బుధవారం డీసీసీబీ స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల బ్రాంచ్ మేనేజర్లు మహబూబీ, కల్యాణిలతో పాటు ఫీల్డ్ ఆఫీసర్లు మరోసారి రుణం బాకీ ఉన్న వారి ఇంటికి వెళ్లి నోటీసులిచ్చి రుణం చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇందులో మద్దెబోయిన కళమ్మ, కుటుంబసభ్యులు రుణం కట్టడం ఇబ్బందిగా ఉందని తెలిపి ఇంటి గేట్లు తీసుకెళ్లమని బ్యాంక్ అధికారులు తీసుకొచ్చిన ట్రాక్టర్ డబ్బాలో వేయడంతో వారు తీసుకెళ్లారు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా బ్యాంక్ అధికారులు కేవలం నోటీసులు ఇచ్చేందుకే వచ్చామని తెలుపుతున్నారు.



ఇంటి గేటును ట్రాక్టర్‌లో వేస్తున్న బాధితుడు

గ్రామాల్లో మినీ జాతరల సందడి



స్టేషన్‌ఘన్‌పూర్: పూజలో మాజీ వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి తదితరులు



చిల్పూరు: తల్లుల గద్దెల వద్ద యాటతో గ్రామస్తులు



జఫర్‌గఢ్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: మినీ మేడారం జాతర సందర్భంగా మండల పరిధిలోని తాటికొండ, జిట్టిగూడెం, ఇప్పగూడెంగ్రామాల పరిధిలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తల్లుల గద్దెల వద్ద బంగారం(బెల్లం) సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించున్నారు. తాటికొండ–జిట్టిగూడెం పరిధిలోని సమ్మక్క–సారలమ్మ తల్లుల గద్దెల వద్ద మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ కె.మహేందర్ గౌడ్, నాయకులు పండుగ బద్రి, తాటికొండ సంపత్, శ్రీనివాస్, నర్సయ్య, రాజు, మల్లేశం, దశరథ, రవి, గౌరేష్, నాగరాజు, తిరుమలేష్ పాల్గొన్నారు.

లింగంపల్లిలో..

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామంలోని సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను బుధవారం కండ్లకోలు బాలరాజు, కంకటి రాజన్నల ఆధ్వర్యంలో తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. వారం రోజుల పాటు ఈ మినీ జాతర ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గొడుగు కుమార్, ఉమ్మడి వెంకటేశ్వర్లు, కొక్కొండ రాజు, టైలర్ రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో సమ్మక్క బండపై వనదేవతలు సమ్మక్క–సారలమ్మల మినీ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది.ఉదయం నుంచి సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద భక్తులు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కుల్లా గోవర్ధన్, కర్ణాకర్ గత ఏడాది సమ్మక్క–సారలమ్మ గద్దెలను నిర్మించారు. అప్పటి నుంచి భక్తులు పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. దాతలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కవితను కలిసిన మనోజ్‌రెడ్డి



చిల్పూరు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్‌ఎస్ నియోజకవర్గం కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

నర్మెట: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. రెండో రోజు బుధవారం స్థాపిత దేవతాహోమములు, స్నపనం, శయ్యాధి, ధనాధి, ధాన్యాధి, పుష్పాధి వాసములను భారతీ తీర్థ పుస్కార గ్రహీత, పురాణ వాచస్పతి పరాశర సరస్వతి పురాణం మహేశ్వర శర్మ పర్యవేక్షణలో అత్తినూరు పవన్‌కుమార శర్మ సారథ్యంలో బుధవారం చేపట్టారు. గురువారం శివపంచాయతన సుబ్రహ్మణ్య ఆంజనేయ ధ్వజ నవగ్రహ సహిత కాశీవిశ్వనాథలింగ ప్రతిష్ఠలు, మేషలగ్న సుముహూర్తమున నిర్వహించే పూర్ణాహుతి, బలిప్రదానం, మహానీరాజనం, ఆశీర్వచనం, మహాన్న ప్రసాద వితరణలతో ప్రతిష్ఠాపనోత్సవాలు ముగుస్తాయని పండితులు తెలిపారు. కాగా, బుధవారం నిర్వహించిన కుంకుమార్చణ, హోమంలో మహిళలు, దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు జంగిటి అంజయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.



విగ్రహాలకు పూజ చేస్తున్న వేదపండితులు

'పేదల సంక్షేమమే ధ్యేయం'

బచ్చన్నపేట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని కొమురవెల్లి దేవస్థాన డైరెక్టర్ కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండనాగారంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇజ్జగిరి రాములు, జంగిలి స్వామి, చల్ల సురేందర్‌రెడ్డి, భూమయ్య, రాజలింగం, శేఖర్, కనుకయ్య, భాస్కర్, రాజురెడ్డి, చందు, భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. పాకాలలో తుడి యుగంధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలపర్చే అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, నాయకులు భిక్షపతి, రవిందర్, నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

చిల్పూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నాయకులు గాలి రాజు, పుట్టరాజు అన్నారు. కొండాపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ముమ్మురంగా ప్రచారం చేయాలని అన్నారు. ఉప్పరి గణేష్, రాజకొంరయ్య, వెంకన్న పాల్గొన్నారు.

దుబ్బతండాలో..

దేవరుప్పుల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ కోరారు. మండలంలోని మాదాపురం దుబ్బతండాలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామశాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, యూత్ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు రవి, గోపి, కిషన్ వెంకన్న, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు సజ్జన్, యాకస్వామి, జాకీర్, రామచంద్రు, నరసింహ, భాస్కర్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: మాట్లాడుతున్న జయప్రకాశ్‌రెడ్డి



కొడకండ్ల: మాట్లాడుతున్న సురేష్‌నాయక్

సంక్షిప్త సమాచారం

నేడు జనగామకు కవిత రాక

జనగామ: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు(గురువారం) జనగామకు రానున్నట్లు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడనున్నట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెన్ను నొప్పితో బాధపడుతున్న కారణంగా కవిత ప్రోగ్రాంనకు రాలేక పోతున్నారని చెప్పారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

జఫర్‌గఢ్: ఇసుకను అక్రమమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై రామ్‌చరణ్ హెచ్చరించారు. మండలంలోని కూనూర్ ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా ఎస్సై, పోలీస్ సిబ్బంది పొక్లెయినర్‌తో బుధవారం ట్రెంచ్ ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

పాలకుర్తి టౌన్: మండలంలోని దుబ్బతండా(ఎస్) గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ భూక్య యాకూబ్, మాజీ వార్డు సభ్యులు భూక్య యాదగిరి భాస్కర్, అనిల్, వెంకటి, రవి, బాలుతో పాటు 30 మంది కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పసునూరి నవీన్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, పుస్కురి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అరూరి వెంకటమ్మకు పలువురి నివాళి

జఫర్‌గఢ్: ఇటీవల మాతృవియోగం పొందిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు అరూరి రమేశ్‌ను పలువురు పరామర్శించారు. బుధవారం రమేశ్ తల్లి వెంకటమ్మ దశదిన కర్మలో వారు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు, అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, తాండ్ర వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, కొండేటి శ్రీధర్, రాజేశ్వర్‌రావు, ధర్మారావు, వన్నాల శ్రీరాములు, నాగుర్ల వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, విజయ్‌చందర్‌రెడ్డి ఉన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

దేవరుప్పుల: సింగరాజుపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా భూక్యా రమేశ్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని, బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

జనగామ రూరల్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.వెంకటరామ నరసయ్య తీర్పు నిచ్చారని సీఐ దామోదర్ రెడ్డి తెలిపారు. వడ్లకొండకు చెందిన బొల్లం శ్రీకాంత్, నక్కవోనిగూడేనికి చెందిన గోదాల లోకేష్‌లు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడగా కోర్టులో ప్రవేశపెడితే జైలు శిక్ష తోపాటు జరిమాన విధించినట్లు చెప్పారు.

వేస్టేజ్ నీటిని వాగులోకి మళ్లించాలి

జనగామ రూరల్: జనగామకు తాగునీరు అందించే ట్యాంకుల నుంచి వచ్చే వేస్టేజ్ వాటర్‌ను వాగులోకి మళ్లించాలని మండలంలోని చీటకోడూరు రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి అందజేశారు.


దుర్గామాతకు ఎమ్మెల్యే పూజలు

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి)గ్రామంలో నిర్వహిస్తున్న దుర్గామాత బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గామాతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

'సరోత్తంరెడ్డి గెలుపునకు కృషి చేయాలి'

పాలకుర్తి టౌన్: ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌడ రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీమాన్, లేగా రామ్మోహన్‌రెడ్డి, శివరాజ్‌యాద్, మహేందర్ తదితరులు ఉన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: కెనరా బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నక్క శాంతికుమార్ అన్నారు. ఘన్‌పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు బ్రాంచిని బుధవారం ప్రారంభించగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జిల్లాలో కెనరాబ్యాంకు మూడో నూతన శాఖను స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్, రవికుమార్, సుందర్‌నాయక్, ఘన్‌పూర్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణ, రాజ్‌కుమార్, వంశీకృష్ణ, గన్ను నర్సింహులు, నీరటి ప్రభాకర్, బ్యాంక్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

పాలకుర్తి టౌన్: తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన ఘటన బుధవారం జరిగింది. పాలకుర్తి మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన తూడి నాగన్న (30) అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మృతుడి కూతురు ఐదు సంవత్సరాల చిన్నారి రితిక తండ్రికి తలకొరివి పెంటింది. చిన్నారి తండ్రి చితికి నిప్పుపెట్టి తెలియని అమాయకత్వంతో నాన్నా లేచిరా అంటూ పిలవడంతో గ్రామస్తులంతా కన్నీటి పర్యంతం అయ్యారు. మృతుడికి భార్య సోనియా ఉన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)